క్లుప్తంగా

ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం

చంద్రుగొండ: విద్యార్థులకు అర్థం అయ్యేలా, సులభతరంగా ఎలా బోధించాలనే అంశంపై చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈఓ ఎం.సత్యనారాయణ ప్రారంభించారు. కోర్స్ డైరెక్టర్ అయిన ఎంఈఓ ఉపాధ్యాయులకు పలు అంశాలను వివరించారు. ఈ శిక్షణ తరగతులు ఐదు రోజులపాటు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు, సీఆర్పీలు, కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో మంగళవారం అశ్వారావుపేట మండలంలో పని చేస్తున్న యస్‌జీటీ, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలకు శిక్షణా కార్యక్రమాన్ని ఎంఈఓ పి.ప్రసాద్‌రావు ప్రారంభించారు. ఉదయం 9గంటలకే ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, జియోట్యాంగింగ్ ద్వారా హాజరు నమోదు చేస్తారని తెలిపారు.

క్రీడాకారుడికి చేయూత



వంశీని అభినందిస్తున్న వైద్యుడు, ఇతరులు

భద్రాచలం: అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధిస్తున్న క్రీడాకారుడికి భద్రాచలం ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు చెందిన వైద్యులు అభినందనలను తెలిపి, ఆర్థిక సాయం అందజేశారు. డెహ్రాడూన్ లో జరిగిన అంతర్జాతీయ ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఏజెన్సీకు చెందిన మోడెం వంశి బంగారు పతకాలతో పాటుగా స్ట్రాంగ్‌మెన్‌గా నిలిచాడు. కాగా, పవర్ లిఫ్టింగ్ ఆఫ్ ఇండియాకు ఎంట్రీ ఫీజు నిమిత్తం రూ.80 వేలు కావాల్సి ఉండగా, విషయాన్ని భద్రాచలానికి చెందిన సిటి స్టైల్ జిమ్ నిర్వాహకుడు రామిరెడ్డి, ఎనస్థీయన్ గుంటూరు కృష్ణ ప్రసాద్‌కు వివరించారు. దీంతో వీరిద్దరు భద్రాచలం ఐఎంఏ ద్వారా పలువురు వైద్యులను కలవగా వారు రూ.80 వేలను మంగళవారం అందజేశారు. గతంలో సైతం అండగా నిలిచిన వైద్యులకు వంశీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహంతి వెంకట కృష్ణాజి, శోభన్ నాయక్‌లు ఉన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: మండలంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దమ్మపేట కోపరేటివ్ సొసైటీ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. మండలపల్లిలో కొనసాగుతున్న డివైడర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకుముందుగా కొత్తూరులో మృతి చెందిన పొట్టా రాములమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, ఎంఈఓ కీసర లక్ష్మి, ఏఓ చంద్రశేఖర రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిబిరం

అశ్వారావుపేటరూరల్: గడిచిన పదిహేను రోజులుగా స్థానిక జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ పొన్నగంటి ప్రసాద్ రావు మాటాడారు. విద్యార్థులు నేర్చుకొని తయారీ చేసిన కళాకృతులు, చిత్రకళ బొమ్మలను పరిశీలించి అభినందించారు. బహుమతులు అందించారు. కాంప్లెక్స్ హెచ్ఎం హరిత, ఉపాధ్యాయులు కిశోర్, నర్సింహారావు, రాజు, సీఆర్పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

కేటీఆర్‌తో భేటీ



కేటీఆర్‌తో అమరేందర్..

అశ్వాపురం: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో నందీనగర్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతో కలిసి మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో పార్టీ పరిస్థితులు, అధికార పార్టీ వైఫల్యాలపై ప్రజల అభిప్రాయాలను కేటీఆర్‌కు అమరేందర్ వివరించారు.

పరిశీలకులతో కాంగ్రెస్ నాయకులు..

కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకులైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ప్రమోద్‌కుమార్‌ను మణుగూరులో మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితులు, కార్యకర్తల అభిప్రాయాలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై పరిశీలకులకు భిక్షమయ్య వివరించారు.

సాసర్ పిట్లతో సత్ఫలితాలు

వేసవిలో అడవులలోని జంతువుల, పశు పక్ష్యాదుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ ఏర్పాటు చేసిన సాసర్ పిట్లు సత్ఫలితాలనిస్తున్నాయి. ఎండలకు దప్పిక తీర్చుకునేందుకు వన్యప్రాణులు వంటపొలాలు, జనావాసాల వైపునకు వచ్చి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి. ఈ పరిస్థితులను అధిగమించేందుకు అటవీశాఖ అధికారులు సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. ట్యాంకర్లతో నీటిని తరలించి వాటిని నింపుతున్నారు. అడవుల్లో సంచరించే జంతువులు, పక్షులు సాసర్ పిట్లలో నీరు తాగి దప్పిక తీర్చుకుంటున్నాయి.

– బూర్గంపాడు



సాసర్ పిట్‌లో నీరు నింపుతున్న ఫారెస్ట్ సిబ్బంది..

వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు

- ట్యాంకర్లతో నీటిని నింపుతున్న అటవీశాఖ ఉద్యోగులు
- జనావాసాలవైపు వెళ్లకుండా అడ్డుకట్ట

అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది 70కి పైగా సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత పెరిగి అటవీ ప్రాంతంలోని వాగులలో,వంకలలో నీటి కుంటలలో నీరు అడుగంటుతోంది. దీంతో అటవీశాఖ అధికారుల ఆదేశాలతో బేస్‌క్యాంప్ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది ట్యాంకర్లతో నీటిని తరలించి సాసర్‌లను నింపుతున్నారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి సాసర్ పిట్లను వాటర్ ట్యాంకర్లతో నీటిని తీసుకెళ్లి నింపుతున్నారు. ఆ నీరు తాగి వన్యప్రాణులు, పక్షులు దప్పిక తీర్చుకుంటున్నాయి. జలసంరక్షణ కోసం అటవీశాఖ నిర్మించిన చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటలు కూడా వన్యప్రాణుల దాహార్తిని తీర్చుతున్నాయి.

తప్పిన వేట..

వేసవిలో దప్పిక తీర్చుకునేందుకు వాగులు, వంకలకు వచ్చే వన్యప్రాణులకు వేటగాళ్లు ఉచ్చులు పెట్టి వేటాడుతున్నారు. పంట పొలాల సమీపంలో దాహార్తిని తీర్చుకునేందుకు వచ్చిన వన్యప్రాణులకు విద్యుత్ తీగలు అమర్చి వేటాడుతున్నారు. అటవీశాఖ అధికారులు ఎంత పటిష్టమైన నిఘా పెట్టినా వేటగాళ్లు గుట్టు చప్పుడు కాకుండా అడవి జంతువులను వేటాడుతున్నారు. అడవి జంతువులు పంట చేల వైపు రాకుండా, వాగులు వైపు రాకుండా అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్లు, చెక్‌డ్యామ్‌లు ఉపయోగపడుతున్నాయి. దీంతో వేటగాళ్ల బెడద తగ్గుతుంది.



సాసర్ పిట్‌లో నీరు తాగుతున్న జింకలు

ఇతర చర్యలూ భేష్..

అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఎక్కువగా అడవి పందులు, జింకలు, దుప్పులు, మనుబోతులు, కొండ గొర్రెలు, కుందేళ్లు వంటి వన్యప్రాణులున్నాయి. అదేవిధంగా వివిధ రకాల పక్షులు, సర్పాలు, కీటకాలున్నాయి.

వీటిని కాపాడుకునేందుకు అటవీశాఖ అన్నిరకాల చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా చెట్లను పెంచి వన్యప్రాణుల ఆవాసాలకు అనువుగా ఉండేలా చర్యలు చేపడుతుంది. అటవీ భూముల అక్రమణలపై కఠిన చర్యలు చేపడుతుంది. వన్యప్రాణుల ఆహారం కోసం సహజ సిద్ధమైన అడవులను పెంచేందుకు అటవీశాఖ కృషి చేస్తుంది. ఫారెస్ట్ నర్సరీలలో తునికి,విప్ప,పాల, చింత వంటి అటవీ ఫలాలనిచ్చే మొక్కలు నాటుతున్నారు. వన్యప్రాణాల ఆహారం కోసం సహజమైన అడవిజాతి మొక్కల పెంపకంతో రానున్న రోజులలో వాటి ఆకలిని తీర్చే అవకాశాలున్నాయి. అదేవిధంగా వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు నీటికుంటలు, చెక్‌డ్యామ్‌లు, సాసర్ పిట్లను ఏర్పాటు చేస్తున్నారు.

దాహార్తి తీర్చేందుకు చర్యలు

వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సహజ సిద్ధంగా నీరు లభించే ప్రాంతాలు ఉన్నాయి. నీరు అందుబాటులో లేనటువంటి 70 చోట్ల సాసర్ పిట్స్‌లో ట్యాంకర్లతో నీటిని నింపుతున్నాం. ఒక్కో సాసర్ పిట్‌కు మధ్య కిలోమీటర్ దూరం ఉండేలా నిర్మాణాలు చేపట్టాం.

- రమేష్, ఎఫ్ఆర్ఓ, అశ్వాపురం

ఆదివాసీల అభివృద్ధే లక్ష్యం

చర్ల: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ఆదివాసీల అభివృద్ధే ధ్యేయంగా పోలీసు శాఖ పని చేస్తోందని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. కమ్యూనిటీ పోలీస్ కనెక్ట్ ప్రోగ్రాంలో మంగళవారం చర్ల పోలీసుల ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన చెన్నాపురంలో ఏర్పాటు చేసిన కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటినీ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి వచ్చే అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మావోయిస్టులకు ఎట్టి పరిస్థితిల్లోనూ సహకరించవద్దని ఆయన సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలకు దుస్తులు పంపిణీ చేయడంతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. గ్రామంలోని యువతకు క్రీడా సామగ్రిని ఆయన అందజేసి ప్రతీ ఒక్కరూ క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు కేశవ్, నర్సిరెడ్డి ఇఖ్కటి, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



చెన్నాపురం గ్రామస్తులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఏఎస్పీ విక్రాంత్ సింగ్

భూసారాన్ని కాపాడుకోవాలి



కరపత్రాలను ప్రదర్శిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

దమ్మపేట: సాగుకు అనువైన వ్యవసాయ భూముల సారమును కాపాడుకోవాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త మధుసూదన్ రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'కార్యక్రమాన్ని నిర్వహించగా.. శాస్త్రవేత్త మధుసూదన్ రెడ్డి మాట్లాడారు. త్వరలో రాబోయే వర్షాకాలానికి అనుగుణంగా దుక్కి దున్నడం, పచ్చి రొట్ట విత్తనాలు నాటడం, బిందు సేద్యం, పంట మార్పిడి, సాగులో ఆధునిక పద్ధతులు తదితర అంశాల గురించి రైతులకు సమగ్రంగా వివరించారు. నీటి సంరక్షణ కొరకు వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఝాన్సీరాణి, రైతు నాయకులు మోరంపూడి వెంకటేశ్వరరావు, దొడ్డా భాస్కరరావు, పర్వతనేని అప్పారావు, దొడ్డా చిన్నసత్యం, బాల రామారావు, బొంతు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో స్థానికులు

మణుగూరురూరల్: ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. దేశ సైన్యానికి మద్దతుగా వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సురక్షాబస్టాండ్, పూలమార్కెట్ సెంటర్, సినిమాహాల్ సెంటర్ మీదుగా తిరిగి అంబేడ్కర్ సెంటర్ చేరుకుంది. ర్యాలీలో ప్రతీ ఒక్కరు జాతీయ జెండాను చేతబూని జై భారత్, జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వివిధ అసోసియేషన్ సభ్యులు, దేశ భక్తులు పాల్గొన్నారు.

పర్ణశాలలో భక్త రామదాసు కీర్తనలు



ఆలయ ప్రాంగణంలో పాటలు పాడుతున్న అకాడమీ సభ్యులు

దుమ్ముగూడెం: పర్ణశాలలోని సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన ఆలయ ప్రాంగణంలో ఊహిత మ్యూజిక్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మంగళవారం భక్త రామదాసు కీర్తనల గాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాముడి భక్తి పాటలను అకాడమీ సభ్యులు ఆలపించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఊహిత మ్యూజిక్ అకాడమీ చైర్మన్ మెండెం రామారావుతోపాటు అకాడమీ సభ్యులు సుమారు 50 మంది పాల్గొన్నారు.

సైడ్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: శివలింగాపురం– బాపనకుంట వరకు రూ.35లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సైడ్ డ్రెయిన్ పనులకు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డ్రెయినేజీ పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని నిత్యం అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్, ఏఈ సత్య, మండల కాంగ్రెస్ నాయకులు పీరినాకి నవీన్, శివ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, సౌజన్య, బాబు, సామా శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్, కుర్రం రవి తదితరులు ఉన్నారు.

జీలుగు విత్తనాలు పంపిణీ

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు జీలుగు విత్తనాలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సంఘ కార్యాలయ ఆవరణలో మంగళవారం పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, మణుగూరు ఏడీఏ తాతారావు, మానిటరింగ్ అధికారి తాళ్లూరి సుజాత, ఏఓ రాహుల్‌రెడ్డి, ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నీలకంఠేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కూచిపూడి బాబు, పాతూరి వెంకన్న, అటిక నర్సింహరావు, సంఘ సీఈఓ జ్ఞానదాస్ పాల్గొన్నారు.

'బక్రీద్'పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్

అశ్వారావుపేటరూరల్: త్వరలో రానున్న బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పాల్వంచ డీఎస్పీ ఆర్ సతీష్ కుమార్ కోరారు. మంగళవారం స్థానిక సీఐ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ నేపథ్యంలో ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని, సంయమనం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ పింగలి నాగరాజు రెడ్డి, ఎస్సై యయాతి రాజు, ట్రైనీ ఎస్సై అఖిల ముస్లిం, హిందు పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలో నెలకొన్న పలు సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతినగర్ గ్రామంలో సైడ్ డ్రెయినేజీలు, అంతర్గత రోడ్లు నిర్మించడంతో పాటు చెరువు పూడికతీత పనులు నిర్వహించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు దామల్ల దయాకర్, పప్పుల ప్రసాద్, గార బుచ్చిరాములు, వేర్పుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

భద్రాచలం: భద్రాచలం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాల వేలం పాటను నిర్వహించనున్నట్లు సీఐ షేక్ రహీమున్నీసా బేగం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ దాడులలో, కేసులలో సీజ్ చేసిన వాహనాలున్నాయని, ఆసక్తి గల వారు నియమ నిబంధనల ప్రకారం ఉదయం 10గంటలకు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

బొగ్గుటిప్పర్ల అడ్డగింత



వాహనాలను అడ్డుకుంటున్న స్థానికులు

చంద్రుగొండ: అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటలో జాతీయ రహదారిపై బొగ్గుటిప్పర్ కారణంగా ప్రమాదానికి గురైై ఎస్‌కె.మౌలాన మృతి చెందడంతో.. స్థానికులు మంగళవారం రాత్రి టిప్పర్లను అడ్డుకున్నారు. మౌలాన కుటుంబీకులతోపాటు స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ శివరామకృష్ణ ఆందోళనకారులను శాంతింపజేశారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దిగ్బంధం

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక వద్ద ప్రధాన రహదారిపై కూలిపోయిన వంతెన నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని ప్రధాన, రహదారి మరమ్మతులు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో తూరుబాకలో మంగళవారం రహదారిని దిగ్బంధించారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి ఎక్కడిక్కడ వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా డివిజన్ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణలు మాట్లాడుతూ.. భద్రాచలం–చర్ల ప్రధాన రహదారి తూరుబాక దగ్గర కల్వర్టు కుంగిపోయి నెలలు గడుస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకున్నది లేదని విమర్శించారు. వర్షాకాలం వస్తే ఈ కల్వర్టు వద్ద వరద నీరు రోడ్డు పైకి వచ్చి ప్రయాణానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని, తక్షణమే పాడైన వంతెనను నిర్మించి, ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ రాస్తారోకోలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌సింగ్ పాటిల్ వాహనం చిక్కుకుంది. సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ వెంకటప్పయ్యలు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మీ, మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ జానీ పాషా, కాలువ పూర్ణయ్య, బొల్లి వెంకట్రావు, కొత్తూరు సీతారామారావు, వాగే వెంకటేశ్వరరావు, భూక్యా చందు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



రహదారి దిగ్బంధంలో బీఆర్ఎస్ నాయకులు

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో సెంటర్ల వద్ద ప్లకార్డులు చేతబట్టి నినాదాలతో ర్యాలీలు తీశారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్చి కార్మికులను బిక్షగాళ్లను చేసే కుట్రలు చేస్తోందని విమర్శించారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



ములకలపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



చర్ల: మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అర్హులకు ఇళ్లు దక్కేనా?

- చర్ల మండలానికి 757 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- మొదటి విడత లబ్ధిదారుల సర్వే పూర్తి
- క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన అధికారులు

చర్ల: ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద అర్హులైన పేదలకు ఇళ్లు అందుతాయా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గ్రామ పంచాయతీల వారీగా ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితాలోని వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించారు. వారం రోజుల పాటు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో మండల స్థాయిలో ఉన్న తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, ఏఓ ఇలా గెజిటెడ్ అధికారులు జాబితాలోని ప్రతీ ఇంటిని సందర్శించారు. వివరాలను నమోదు చేశారు. విచారణ పూర్తి చేసి వివరాలను కలెక్టర్‌కు పంపించారు.

మండలంలో పరిస్థితి ఇదీ..

చర్ల మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 757 ఇళ్లు మంజూరయ్యాయి. పంచాయతీల్లోని 58 రెవెన్యూ గ్రామాలుండగా.. ఒక్కో గ్రామ పంచాయతీకి 20 నుంచి 30 వరకు ఇళ్లు కేటాయించినట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఇంత తక్కువ ఇళ్లు కేటాయించడం వల్ల గ్రామాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని, ఇళ్ల కేటాయింపు సంఖ్యను పెంచాలంటూ స్థానిక అధికారులు నాయకులు విజ్ఞప్తి చేస్తుండగా.. ఇటీవల మండల పర్యటనకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విడతల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఈ పథకంలో చోటు దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.





మండలంలోని కొందరు పేదల పూరిళ్లు..

అర్హులకే ఇళ్లు ఇవ్వాలి



చర్ల మండలంలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అర్హులైన వారి పేర్లు లేకపోవడం దురదృష్టకరం. పూరిళ్లు, రేకుల షెడ్ల కింద ఉన్న వారిని విస్మరించి పక్కా భవనాలు ఉన్న వారికే కేటాయించారు. ఇందిరమ్మ గ్రామ కమిటీలు అర్హులను గుర్తించడంలో విఫలమయ్యాయి. మరలా అధికారులు లబ్ధిదారులను గుర్తించాలి.

– కొండా కౌశిక్, బీఎస్పీ మండల అధ్యక్షుడు, చర్ల

కలెక్టర్‌కు పంపించాం..



చర్ల మండలంలో మొదటి విడతలో 757 ఇళ్లు మంజూరు కాగా అందుకు సంబంధించి అన్నీ గ్రామ పంచాయతీల్లో గెజిటెడ్ స్థాయి అధికారులతో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయించాం. ఆ వివరాలను జిల్లా కలెక్టర్‌కు పంపించాం. కలెక్టర్ నుంచి అనుమతి రాగానే లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తాం.

– ఎస్‌కె.వలీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, చర్ల

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -9000327175. టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416